ప్రజాశక్తి

బుధవారం 16 ఏప్రిల్ 2025 5

శ్రీ సత్యసాయి

గిన్నిస్ సర్టిఫికెట్ను అందుకుంటున్న తండ్రి కుమారులు

చిట్టి చేతుల్లో గొప్ప ఘనత

గిన్నిస్ రికార్డుతో మహిమాన్విత్ కీర్తి

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు విద్యార్థి మహిమాన్విత్‌కు అరుదైన గౌరవం దక్కింది. మండలంలోని శ్రీ సాయి యేసు హైస్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి ఎం. మహిమాన్విత్ గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నాడు. డిసెంబర్ 1న విజయవాడలో హలేల్ సంగీత పాఠశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 1046 మంది ఒకే సమయంలో సంగీత పరికరమైన కీబోర్డు వాయించి గిన్నిస్ రికార్డు నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో మహిమాన్విత్ తన తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎం. ముత్యాలప్పతో కలిసి పాల్గొన్నాడు. ఈ ఘనతపై మహిమాన్విత్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసిన వీడియోకు విశేష ఆదరణ లభించింది. ఏప్రిల్ 14న హైదరాబాద్‌లో హలేల్ సంగీత పాఠశాల స్థాపకుడు అగష్టిన్ దండింగి చేతుల మీదుగా గిన్నిస్ సర్టిఫికెట్‌ను మహిమాన్విత్ తన తండ్రితో పాటు అందుకున్నారు. విద్యార్థి ఈఘనత సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఎల్. భాస్కర్, అధ్యక్షురాలు ఎల్. రాధ, తల్లి మెర్సీ రాణి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం

◆ పల్లెలు, పట్టణాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం
◆ రోజుకు 68 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు
◆ పర్యావరణంపై తీవ్ర ప్రభావం
◆ నిషేధం అమల్లో ఉన్నా చోద్యం చూస్తున్న యంత్రాంగం

చెత్తకుప్పలో పడేసిన ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా.. ప్రజలు వినియోగిస్తూనే ఉన్నారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. దీనిని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతుంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటుంది. జీవమనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర, పురపాలక సంస్థలు వైఫల్యం చెందాయన్న విమర్శలు బలంగా వినపడుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం కార్పోరేషన్‌తో పాటు హిందూపురం, పుట్టపర్తి, ధర్మవరం, మడకశిర, పెనుకొండ, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, కళ్యాణదుర్గం, మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంది. ఈ పట్టణాల్లో దాదాపు 10.45 లక్షల జనాభా ఉంది. రోజూ 422 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఈ చెత్తలో సుమారుగా 68 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయని అధికారులే తెలిపారు. అంటే నెలకు 1,845 టన్నులు, ఏడాదికి సరాసరి 22 వేల టన్నులకు పైగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇక గ్రామాల్లో వినియోగం సరేసరి. సుప్రీంకోర్టు తీర్పుమేరకు 50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్‌ను వినియోగిస్తే పురపాలక శాఖ అధికారులు దాడులు చేసి జరిమానా వేయవచ్చు. రూ.500 నుంచి రూ.5 వేలకుపైగా అపరాధ రుసుం విధించవచ్చని అధికారులే చెబుతున్నారు. అయినా దాడులు నామమాత్రమే.

సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే....

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అన్ని పురపాలక సంఘాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో అన్ని సచివాయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికి ప్లాస్టిక్ నిషేదం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. అక్కడక్కడ పురపాలక సంఘాల్లో సచివాలయ పర్యావరణ కార్యదర్శులు బృందంగా ఏర్పడి దాడులు నిర్వహించి, ప్లాస్టిక్‌ను పట్టుకున్నప్పటికి వారికి విధించే జరిమానాలు తక్కువ ఉండడంతో వ్యాపారులు ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించడం లేదు. నిషేధాన్ని కఠినంగా అమలు చేయడానికి పర్యావరణ కార్యదర్శులు నిర్లక్ష్యం వీడి దాడులు నిర్వహించి, జరిమానాలతో పాటు కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తే తప్ప పూర్తి స్థాయిలో నిషేధం అమలు కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎక్కడపడితే అక్కడ...

ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేస్తున్నారు. మురుగు కాల్వల్లో వేయడం వల్ల కాలువలకు అడ్డుపడి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కల్వర్టులకు అడ్డంగా చేరి వర్షం వస్తే రోడ్లు చెరువుల్లా మారుతున్నాయి. దుకాణదారులు డ్రయినేజీలపై బండలు వేయడం, వాటి కింద ప్లాస్టిక్ ఇరుక్కుపోయి పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. 50 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్ వినియోగం నిషేధం ఉన్నా.. అమలు చేయడంలో పురపాలక యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

ఓ ట్రాన్స్‌పోర్టు వద్ద స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ (ఫైల్ ఫొటో)

ముంచుకొస్తున్న ముప్పు

ప్లాస్టిక్ వాడకం వల్ల భూతాపం పెరుగుతుందని పలు అధ్యయనాలు తేల్చాయి. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోని ఆహార పదార్థాలు తినడం వల్ల ప్రమాదకరమైన 'కార్సినోజన్లు' శరీరంలో చేరి క్యాన్సర్‌కు దారితీస్తుందని, చర్మ వ్యాధులు, సంతానలేమి వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంట్లో మిగిలిన ఆహారం, కూరగాయల వ్యర్థాలు ఈ బ్యాగుల్లో వేసి చెత్తకుండీల్లో వేస్తున్నారు. వీటిని మూగజీవాలు తిని మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ భూమిపొరలో చేరి భూగర్భంలో కాలుష్యం ఏర్పడుతోంది. ప్లాస్టిక్ కాల్చివేయడం వల్ల అందులోని రసాయనాలు వాతావరణంలో కలిసి మానవ, జీవరాశుల మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేలా ప్రజల్లో అధికారులు చైతన్యం తీసుకురావాల్సి ఉంది. అలాగే నిషేధిత ప్లాస్టిక్ కవర్లు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విస్తృత దాడులు చేస్తాం

యాభై మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం నిషేధించింది. ఎక్కడైనా వినియోగిస్తే దాడులు చేసి చట్టపరమైన చర్యలతో పాటు భారీ జరిమానా విధిస్తాం. పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్న శానిటేషన్ సెక్రటరీలతో పాటు ఇతర సెక్రటరీలను టీంగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తాం. ఒక ప్రణాళికతో త్వరలో పట్టణంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తాం.

సంగం శ్రీనివాసులు
మున్సిపల్ కమిషనర్

'పది' విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వైష్ణవి

పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అవుతానేమో అన్న ఆందోళనతో నిత్యం మధన పడుతున్న విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ధర్మవరం మండలం గొట్లూరు గ్రామంలో చోటు చేసుకున్న ఈఘటనకు సంబందించి పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గొట్లూరు గ్రామానికి చెందిన సాకే వైష్ణవి పట్టణంలోని మోడల్ హైస్కూల్లో పదవ తరగతి చదువుతోంది. ఈ మేరకు ఆమె పరీక్షలను రాసింది. పరీక్షల అనంతరం ఇంటికి వచ్చిన వైష్ణవి తాను పరీక్షలు బాగా రాయలేదని, ఫెయిల్ అవుతానేమో అని నిత్యం తన తల్లిదండ్రులతో బాధపడుతూ ఉండేది. దీంతో ఆమె తల్లిదండ్రులు వైష్ణవికి ధైర్యం చెబుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తండ్రి ఓ పనిమీద బయటకు వెళ్ళగా, తల్లి కూలి పనికి వెళ్ళింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వైష్ణవి తన ఇంట్లో మేడపైన గల కిటికీకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తరువాత ఇంటికి కృష్ణయ్య ఎంతపిలిచినా తన కూతురు తలుపు తీయకపోవటంతో పక్క ఇంటిపై నుంచి చూడగా వైష్ణవి చీరకు వేలాడుతూ కన్పించింది. స్థానికుల సాయంతో వైష్ణవిని కిందకు దించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే వైష్ణవి మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైష్ణవి తండ్రి కృష్ణయ్య మగ్గం పని, తల్లి ధనలక్ష్మి కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి వైష్ణవితో పాటు 11 సంవత్సరాల పార్థసాయి, రెండు సంవత్సరాల చరిత్ కుమార్ ఉన్నారు. ఈసందర్భంగా వైష్ణవి తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తె పరీక్షలు రాసి వచ్చినప్పటి నుంచి ప్రతిరోజు బాధపడటంతో పాటు అన్నం కూడా సరిగా తినేది కాదని వాపోయారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రైతులకు ఎకరాకు రూ. 50 వేల రుణమివ్వాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఎకరాకు రూ. 50 వేల వరకూ రుణ సదుపాయం పెంచాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని లీడ్ బ్యాంకు కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కనీసం పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో వలస వెళ్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో పంట రుణాలు, బంగారు ఆభరణాలపై వడ్డీ, అసలు లేకుండా రెన్యువల్ చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నందున రుణ సదుపాయం పెంచడంతో పాటు సకాలంలో విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించాలని కోరారు. అందుకు ప్రభుత్వంతో పాటు బ్యాంకర్లు సహకరించి అన్ని విధాలా రైతులకు సదుపాయాలు కల్పించా ల్సిన అవసరం ఉందన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో బ్యాంకు సిబ్బందికి వినతిపత్రం అందించారు. ధర్నాలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.శివన్న, వివి.రమణ, లక్ష్మీనారాయణరెడ్డి, ఫకృద్దీన్, సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగం సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కొత్తచెరువు : రైతాంగం సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైం దని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న విమర్శించారు. రైతుల సమస్యలపై మంగళవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రైతులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారన్నారు. కావున వారు తీసుకున్న రుణాలకు వడ్డీ మాత్రమే కట్టించుకొని రుణాలు రెన్యువల్ చేయాలన్నారు. అసలు, వడ్డీ చెల్లిస్తేనే రుణాలు రెన్యువల్ చేస్తామని రైతులను ఇబ్బంది పెట్టవద్దని బ్యాంకు మేనేజర్‌ను కోరారు. తక్షణమే వడ్డీ కట్టించుకొని రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో బ్యాంకు ముందు ధర్నా

పుట్టపర్తిలో బ్యాంకు ముందు ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-హిందూపురం

నివాస ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రభాకర్ సూచించారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని గురునాథ్ టాకీస్ సర్కిల్, మేళాపురం సర్కిల్, రహమత్ పురం, చిన్న మార్కెట్ సర్కిల్ లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అదే విధంగా ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో, అపార్ట్ మెంట్ లలో అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే ఏ విధంగా మంటలను అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

ఉప కారాగారంలో ఉండే ఖైదీల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని, అనారోగ్యానికి గురైతే ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి ఉపకారాగార అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడారు. అనంతరం జైలు గదులను పరిశీలించారు. అలాగే ఖైదీలకు ఆహారం తయారుచేసే నిమిత్తం పంపిణీ చేసిన నిత్యావసరాలను, కూరగాయలను న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం కోసం బాధిత కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి తాలూకా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కదిరి ఆర్డీవో కార్యాలయం ముందు భవన నిర్మాణ కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఇంటి పట్టాల అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన ఇంటి పట్టాల సమస్యను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మికులు ర్యాలీగా వెళ్లి ఆర్డీవో కార్యాలయం ముందు మహిళలు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి పట్టణం హిందూపురం రోడ్డులో సర్వేనెంబర్ 1769,1770 1713 లో 2007 సంవత్సరంలో 320 మంది కార్మికులకు ఇంటి పట్టాలు కేటాయించారన్నారు. కార్మికులు కోసం కేటాయించిన ఇంటి పట్టాలలో అవకతవకలు జరిగాయన్నారు. ఈవిషయంపై స్థానిక ఎమ్మెల్యే కందికుంట స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆర్డీవోను కోరారు. దీంతో ఆర్డీవో ఐదు మంది సభ్యులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశారన్నారు. అయితే కమిటీ ఏర్పాటు చేసి దాదాపు రెండు నెలల కావస్తున్న ఇంతవరకు కమిటీ ఏం విచారణ జరిపిందో తెలపాలన్నారు.

కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్

మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్ లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, జీవో నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులందరికీ రూ. 21వేలు వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. అప్కాస్ లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ హిందూపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతు పురపాలక సంఘంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు వాటర్ వర్క్స్, స్ట్రీట్ లైటింగ్, ఆఫీస్ స్టాఫ్, పంప్ హౌస్ వర్కర్స్, వాల్ ఆపరేటర్స్, డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్ లు ఆప్కాస్ లో పనిచేస్తున్నారన్నారు. ఇటీవల మంత్రివర్గం అప్కాస్‌ను రద్దు చేయాలని నిర్ణయం చేయడం జరిగిందని దీనిపైన అనేక అనుమానాలు ఉన్నాయని, ఆప్కాస్ రద్దు చేస్తే ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు మల్లికార్జునతో పాటు నాయకులు ఆనంద్, రామచంద్ర, నారాయణ, బాలాజీ, చంద్ర, బాబయ్య, మూర్తి, శంకర, కవితమ్మ, శోభమ్మ, ఓబులమ్మతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ఫెలోషిప్‌కు ఎన్ఎస్‌పిఆర్ కళాశాల విద్యార్థిని

ప్రతిభా విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఫెలోషిప్ కు ఎంపికైనట్లు ఆకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆ విద్యార్థి అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, కళాశాలలో బిఎస్సీ తృతీయ సంవత్సరం చదువుతున్న జయశ్రీ సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ కి ఎంపికైనట్లు తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధనకు సమ్మర్ రీసెర్చ్ ఫెలోషిప్ పేరుతో బెంగళూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్స్ పరిశోధన కోసం నిర్వహించిన ఎంపిక పోటీలలో మెరిట్ ప్రాతిపదికన తమ కళాశాల విద్యార్థి ఎంపికవడం కళాశాలకే గర్వకారణమని అన్నారు. విద్యార్థిని ఎంపికకు తోడ్పాటునందించిన కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులును ప్రిన్సిపల్ అభినందించారు. ఎంపికైన విద్యార్థి మూడు నెలల పాటు పశ్చిమ బెంగాల్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బయో మెడికల్ జినోమిక్స్ లో సీనియర్ పరిశోధకులు డాక్టర్ అరవింద్ కోర్వార్ పర్యవేక్షణలో పరిశోధన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏ సి కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీ లక్ష్మి, అధ్యాపకులు డాక్టర్. ప్రకాష్ రావ్, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు విజేతను అభినందించారు.

నాయకత్వ లక్షణాల శిక్షణకు ప్రిన్సిపల్

అధ్యాపకులలో బోధనా నైపుణ్యాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ తద్వారా విద్యార్థి యువతకు అందించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ మాలవ్య మిషన్ ద్వారా రాష్ట్రంలోని ఎంపిక చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ లలో మొదటి విడతలో భాగంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూర్కి లో వున్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో వారం రోజులు జరిగే ప్రత్యేక శిక్షణకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. యం. ప్రగతి ఎంపికైంది. దీంతోకళాశాల సిబ్బంది, కళాశాల అభివృద్ధి, ప్రణాళిక మండలి సభ్యులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

సిపిఎం కాలనీ, జగనన్న లేఅవుట్‌లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-గోరంట్ల

ప్రజల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ మండలంలోని పాలసముద్రం క్రాస్ వద్ద ఉన్న సిపిఎం కాలనీలో 170కి పైగా నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. రోడ్లు, నీరు, విద్యుత్, తదితర కనీస సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎముకలగుట్టపల్లి వద్ద జగనన్న లేఅవుట్‌లో సుమారు 75 మంది గృహాలు నిర్మించుకున్నా మౌలిక వసతులు కల్పించలేద న్నారు. దీనికి తోడు సమీపంలోనే గ్రామ పంచాయతీ వారు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు నివాసం ఉండే పరిస్థితి లేదన్నారు. డంపింగ్ యార్డును తరలించాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. గోరంట్లలో డీలర్లు కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే బియ్యం పంపిణీ చేస్తున్నారని, తూకాల్లో కూడా భారీగా వ్యత్యాసాలు ఉంటున్నాయని మండిపడ్డారు. స్పందించిన ఎంపిడిఒ కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని, ఎముకలగుట్టపల్లి వద్ద డంపింగ్ యార్డ్‌ను తొలగిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగభూషణ, ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ నాయకులు ఆంజనేయులు, శోభ, గంగమ్మ, రత్నమ్మ, హబీబ్, బాబా, నూరమ్మ పాల్గొన్నారు.


ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న కెవిపిఎస్, వ్యకాసం నాయకులు

అంగన్వాడీ వర్కర్‌పై వేధింపులు దుర్మార్గం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పల్నాడు జిల్లాలో అంగన్వాడీ వర్కర్‌పై టిడిపి నాయకుడు లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని ఖండిస్తూ మంగళవారం పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు జెవి.రమణ, ఎస్‌హెచ్.బాషా, టి.అయుబ్‌ఖాన్, ఎస్.హైదర్‌వలి, డి.చంద్రకళ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో అంగన్వాడీ కార్యకర్త భర్త మృతి చెందగా టిడిపి నేత బొడ్డు వెంకటేశ్వరరావు ఆమెకు ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ ఇప్పిస్తామని మభ్యపెట్టి ఆమె నుంచి రూ. లక్ష డబ్బులు తీసుకుని మోసం చేయడంతో పాటు లైంగికంగా వేధించడం దుర్మార్గమన్నారు. అతడిని టిడిపి అధిష్టానం వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే అధికార పార్టీ నాయకులు కార్మికులపై వేధింపులకు పాల్పడితే రాబోయే కాలంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారున. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ లీడర్స్ పోతక్క, అరుణ, టీచర్స్ రత్నమ్మ, జ్యోతి, శకుంతల, రాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ నరేంద్రకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న కెవిపిఎస్, వ్యకాసం నాయకులు

సిలబస్ తగ్గించాలని డిఇఒకు వినతి

ప్రజాశక్తి-కొత్తచెరువు

9, 10 తరగతుల విద్యార్థులకు సిలబస్ తగ్గించాలని కోరుతూ మంగళవారం జిల్లా ఇంగ్లీష్ ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో డిఇఒ జి.కృష్ణప్పకు వినతిపత్రం సమర్పించారు. ఇంగ్లీషు బోధించే ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, నాగభూషణ, రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ 9, 10 తరగతులకు సిలబస్ అధికంగా ఉండడంతో చదవలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక్కో తరగతిలో 9 యూనిట్లు అదనంగా సప్లిమెంటరీ రీడర్, వర్క్ బుక్కులు ఉన్నాయన్నారు. సిలబస్ అధికంగా ఉన్నందు వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠ్యాం శాల్లోని అన్ని విషయాలను పూర్తిస్థాయిలో బోధించడానికి సమయం సరిపోవడం లేదని, తక్షణమే ఒక్కో తరగతిలో 6 యూనిట్లు ఉండేలా సిలబస్ తగ్గించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రేష్మభాను, రామ్మూర్తి, బాబు, ఎల్‌వి.రమణ, వాసు, నరసింహులు ఉన్నారు.

డిఇఒ కృష్ణప్పకు వినతి ఇస్తున్న ఇంగ్లీషు ఉపాధ్యాయులు

కనుమ మారెమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో మంగళవారం నిర్వహించిన కనుమ మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా వేదపండితులు వారికి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం వారు జాతర నిర్వాహకు లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు మాధవరాజు, ఓబులేసు, వాల్మీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టకామప్ప ఉన్నారు.

కనుమ మారెమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యే రాజును సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే

కనుమ మారెమ్మను దర్శించుకున్న అనంతరం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఎమ్మార్పీఎస్ గౌరవ అ ధ్యక్షులు ఎన్‌ఆర్.నరసింహులు ఇంటికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. వారితో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు విశ్వనాథ్, ఉమ్మడి అనంతపురంజిల్లా అధ్యక్షులు సామ్రాట్ మధు, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు బీచిగానిపల్లి రామాంజనేయులు, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు నాగరాజు, గంగాధర్, ఎల్లోటి హనుమంత, తదితరులు ఉన్నారు.

రైతులకు మోటార్లు పంపిణీ

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్ ఆధ్వర్యంలో తాలుకా పరిధిలోని 20 మంది రైతులకు పంపు మోటార్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కర్నాటక ఆది జాంబవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి గంగ కళ్యాణ యోజన కింద మంజూరైన పంపు మోటార్లను సన్నకారు రైతులకు పంపిణీ చేశామన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, పిఎల్‌డి బ్యాంక్ ఛైర్మన్, కడమలకుంట శేషగిరి మున్సిపల్ ఛైర్మన్ హెచ్. రాజేష్, వైస్ ఛైర్మన్ గీతా హనుమంత రాయప్ప, కర్నాటక ఆది జాంబవ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మంజునాథ్, తాలూకా అభివృద్ధి అధికారి ఎస్‌ఎం.రాజశేఖర్, పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని రాస్తారోకో

ప్రజాశక్తి-పావగడ

తాలూకా పరిధిలో భూమిలేని నిరుపేద రైతులు ప్రభుత్వ బీడు భూములను సాగు చేస్తున్నారని వారికి వెంటనే సాగు పట్టాలు అందించాలని హసిరు సేన రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పూజారప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హసిరు సేన రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సంఘాల నాయకులు, రైతులు ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి తహశీల్దార్ వరదరాజుకు వినతిపత్రం సమర్పించారు. పూజారప్ప మాట్లాడుతూ తాలూకాలోని రైతులు దశాబ్దాలుగా ప్రభుత్వ బీడు భూములు సాగు చేస్తూ పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదన్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రత్యేక చొరవ చూపి సాగు చేస్తున్న రైతులందరికీ రెండు లేదా మూడు ఎకరాల చొప్పు పట్టాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షుడు బ్యాడనూరు శివు, నరసప్ప, ఈరన్న, వెంకటస్వామి, హనుమంతు, తిప్పేస్వామి, పెద్దఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆందోళన

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని 33, 34 వార్డులలో నెలకొన్న సమస్యలపై ఆ వార్డుల ప్రజలు మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని రివర్స్ కాలనీ దేవానంద్ కాలనీ లో నేటికీ సిమెంట్ రోడ్లు లేక గుంతల రోడ్లో ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోయారు. అలాగే వీధిలైట్లు లేక రాత్రివేళల్లో వెళ్లాలంటే ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అదేవిధంగా వికలాంగుల కాలనీలో కర్ణాటక నుండి ఆ ప్రాంతంకి వలస వచ్చిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇస్తానంటూ ప్రజల నుండి రూ. 50 వేలు నుండి లక్ష రూపాయలు వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ డీఈ విజయ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ హుస్సేన్, 34 వార్డు టిడిపి నాయకులు రమణా నాయుడు , తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు.. ఇబ్బందుల్లో ప్రజలు

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఎక్కడికక్కడ రోడ్లపై మురుగునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రధానంగా హిందూపురం రోడ్డు, నాలుగో వార్డులో ఇళ్ల ముందు మురుగునీరు పెద్దఎత్తున చేరింది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చీపులేటి గ్రామం రోడ్లపై కూడా మురుగునీరు నిల్వ ఉండి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రజాప్రతినిధులు కానీ, మున్సిపాలిటీ అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు.

పశువుల నీటితొట్టె ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో పశువుల నీటితొట్టె ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచి గంగమ్మ నాగరాజు, పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డ్ మెంబర్లు, డీలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టె ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సర్పంచి, అధికారులు

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

శాంతి భద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినా, సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టినా ఎంతటి వారైనా ఏ పార్టీకి చెందిన వారైనా ఉపేక్షించే లేదని డీఎస్పీ మహేష్ స్పష్టం చేశారు. స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సోషల్ మీడియాలో వైరలైన అంశాలు, ఆయా సంఘటనల్లో అరెస్టు చేసిన వారి వివరాలు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ ముద్దిరెడ్డిపల్లికి చెందిన గొరవ మోహన్ తన స్వగ్రామం చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దెల గ్రామంలో మద్యం మత్తులో మాజీ సిఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి తన మొబైల్‌లో రికార్డు చేసి మిత్రులకు వాట్సప్ చేశాడన్నారు. ఆ వీడియో ఈ నెల 11వ తేదీ నుండి సోషల్ మీడియాలో వైరల్ అయిందన్నారు. దీంతో మోహన్‌ను హతమార్చాలన్న ఉద్దేశంతో 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో అతను హిందూపురం పట్టణంలోని బాలాజీ సర్కిల్ ఉన్న హిడెన్ హాట్స్ రెస్టారెంట్‌లో ఉన్న విషయం తెలుసుకున్న సురేష్ అలియాస్ సూరి మరో నలుగురు కలిసి బీర్ బాటిల్‌తో విచక్షణారహితంగా దాడి చేసి, దీనిని వీడియో చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఈ నెల 12వ తేదీ గొరవ మోహన్ వై.ఎస్.జగనమోహన్ రెడ్డి ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావటంతో దీనిపై హిందూపురం 1వ పట్టణ పోలీసు స్టేషన్ లో వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు గొరవ మోహన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. తర్వాత 12వ తేదీ మధ్యాహ్నం గొరవ మోహన్ ఫిర్యాదు మేరకు 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సురేష్ అలియాస్ సూరి, శివకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. అదే రోజు సాయంత్రం బోయ లోకేష్, నవీన్ కుమార్ మరికొందరు ఇనుప రాడ్డుతో గొరవ మోహన్ బావమరిది ఇంట్లోకి ప్రవేశించి గొరవ మోహన్ కనిపిస్తే చంపేస్తామని బెదిరించడం జరిగిందన్నారు. దీనిని కూడా వీడియో చేసి సోషల్ మీడియా నందు వైరల్ చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ బోయ లోకేష్ అలియాస్ లోకేష్ వాల్మీకి, నవీన్ కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు పంపామన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బోయ లోకేష్ అలియాస్ లోకేష్ వాల్మీకి పై టూ టౌన్ పట్టణ పోలీసు స్టేషన్ లో రౌడీ షీట్ ఉందన్నారు. అలాగే అతనిపై హిందూపురం 1వ పట్టణ పోలీసు స్టేషన్‌లో 4 క్రిమినల్ కేసులు కూడా ఉన్నాయని డీఎస్పీ చెప్పారు. వాల్మీకి లోకేష్ పై మొత్తంగా ఆరు క్రిమినల్ కేసులో ఉన్నట్లు చెప్పారు. ఈ విధంగా చట్టాన్ని చేతిలోకి తీసుకుని నేరం చేస్తూ, స్వయంగా వారి చేస్తున్న నేరాన్ని వీడియోలు తీయించుకుంటూ సోషల్ మీడియా ద్వారా వారి నేరాన్ని వైరల్ చేయడం వల్ల నేర ప్రవృత్తి నేరస్తులకు పెరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఇలాంటి చర్యలను వదిలే ప్రసక్తే లేదన్నారు. నేరం చేయమని రెచ్చగొట్టే వారిని కూడా వదిలేది లేదని ఆయన చెప్పారు.వ్యక్తిగత దూషణ కూడా సహించేది లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో మీడియా, రాజకీయ నాయకులు, ప్రజలు అందరూ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకునేందుకు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ కోరారు. ఈ సమావేశంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్ధన్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి మహేష్

మున్సిపల్ కార్మికులను ప్రయివేటు సంస్థలకు అప్పగించొద్దు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులను ఆప్కాస్ నుంచి వేరు చేసి ప్రయివేటు సంస్థలకు అప్పగించవద్దని మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సిఐటియు పట్టణ కార్యదర్శి పైపల్లి గంగాధర్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు ప్రభుత్వం ఎప్పటికైనా తమను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తుందని 25 ఏళ్లుగా ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో వైసిపి నాయకులు తాము అధికారంలోకి వస్తే పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి గత ఐదేళ్ల ఏనాడూ పట్టించుకోలేదన్నారు. అయితే ఆప్కాస్ కిందకు కార్మికులను తీసుకురావడంతో కార్మికులకు వేతనాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి ప్రయివేట్ ఏజెన్సీలకు అప్పగించాలని చూస్తుందన్నారు. ఇదే జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. ప్రతి కార్మికునికి రిటైర్మెంట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఆ కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింహులు, నాగార్జున, నారాయణ, రామయ్య, పెద్దన్న, నాగరాజు, సద్దాం, సరోజ, నారాయణమ్మ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు

కమిషనర్ ప్రహ్లాదకు వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

పంచాయతీ కార్యదర్శికి వినతి ఇస్తున్న సిపిఎం నాయకులు

వ్యర్థాలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక సాయినగర్ కాలనీ సమీపంలో వ్యర్థాలు తొలగించాలని, కుక్కల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు సిపిఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. సిపిఎం నాయకులు, కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీలో సుమారు 500 కుటుంబాలు నివాసం ఉన్నాయన్నారు. సోమందేపల్లిలోని చికెన్, మటన్ వ్యాపారులు వాటి వ్యర్థాలను కాలనీ సమీపంలో వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లి ప్రజలు రోగాల బారిన పడుతున్నార్నారు. మాంసాహార వ్యర్థాల కోసం వీధి కుక్కలు అక్కడికి చేరి పోట్లాడుకుంటూ కాలనీలోని వృద్ధులు, పసి పిల్లలపై దాడి చేస్తున్నాయన్నారు. ఆ వ్యర్థాలను గ్రామానికి సుదూరంగా మరోచోటికి తరలించాలని, వ్యర్థాలు వేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. ఇకనైనా ఆ వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని లేనిచో కాలనీ వాసులతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ వ్యాపారులందరికీ నోటీసులు ఇచ్చి పోలీసు అధికారులతో కూడా మాట్లాడి సమావేశం ద్వారా తీర్మానం చేసి ఖచ్చితంగా డంపింగ్ యార్డ్ తొలగింపునకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశులు, రామకృష్ణ, మాబు, బెస్త కిష్టప్ప, అశోక్, తిరుమలేష్, జి.లక్ష్మీనారాయణ, గాజుల రమేష్, జయరామ్ నాయక్ పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి

ప్రజాశక్తి-పెనుకొండ

సమాజ సేవలో సంతృప్తి ఉందని హుందాయి ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులు యోన్‌సాంగ్, ధూమ్ ఇమ్ కిమ్ తెలిపారు. హుందాయి ట్రాన్సిస్ కంపెనీ ఇచ్చిన రూ. 25 లక్షలతో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సెంటర్, స్టడీ అవర్స్‌కు సభా ప్రాంగణం, రూ. 10 లక్షలతో ప్రహరీ, లైబ్రరీ, తాగునీటి పైప్‌లైన్, 2 బీరువాలు, 4 గదులకు గ్రిల్ ఏర్పాటు చేశారు. అలాగే పిల్లలకు ప్లేట్లు, గ్లాసులు, తినుబండారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో హుందాయి ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ సమాజ సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ముఖ్యంగా విద్యకు చేయూతనివ్వడం మరింత సంతృప్తినిచ్చిందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకుని సమాజానికి ఉపయోగపడాలని సూచించారు. అనంతరం వారిని ప్రిన్సిపల్ సుదర్శన్, హైస్కూల్ హెచ్‌ఎం రామకృష్ణ, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉప విద్యాశాఖ అధికారి పద్మప్రియ, జూనియర్ కళాశాల, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

హుందాయి కంపెనీ ప్రతినిధులను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ సుదర్శన్

సమన్వయ సమావేశం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని పివిఆర్ ఫంక్షన్ హాల్ నందు మంగళవారం తలుపుల మండల టీడీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బాలయ్య పిఎ వీరయ్య

నీటి సమస్య పరిష్కారానికి ఐక్యంగా కృషి చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు ఐకమత్యంతో పని చేయాలని బాలయ్య పిఎ వీరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి పట్టణంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని వార్డులలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలో లీకేజీలను గుర్తించి త్వరితగతిన మరమ్మతు చేయించాలన్నారు. అన్ని వార్డులకు కొళాయి నీరు పంపిణీ చేయాలని, నీటి సమస్యల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. సమిష్టిగా పనిచేసి నీటి సమస్యలు లేకుండా చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ఇర్షాద్ అహమ్మద్, ఆయూబ్, ఇన్చార్జి ఎమ్.ఈ. మోహన్, ఇన్‌ఛార్జి డిఇఇ ఆనంద్ రాజు, ఏఈలు జనార్ధన్, శంకర్, టీడీపీ నాయకులు బాబు, అమ్యూనిటీ కార్యదర్శులు, ఫిట్టర్లు, వాటర్‌మెన్లు పాల్గొన్నారు.

గొల్లపల్లి రిజర్వాయర్ పరిశీలన

మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య మంగళవారం పెనుకొండ సమీపంలో ఉన్న గొల్లపల్లి రిజర్వాయర్ ను సందర్శించారు. వేసవికాలంలో ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా తక్షణ మరమ్మతులు చేయించాలని అందుకు కావాల్సిన సామాగ్రి, ఇతరత్రా అవసరాలను సమకూరుస్తామని తెలిపారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుండి వచ్చే నీటిని ఫిల్టర్ బెడ్స్ ద్వారా శుద్ధి చేసి ప్రజలందరికీ నీటిని సరఫరా చేసే ప్రక్రియను పరిశీలించారు. ప్రస్తుతం హిందూపురం కి 9 ఎం.ఎల్.డి నుండి 10 ఎం. ఎల్.డి వరకు నీరు సరఫరా జరుగుతుండగా ఫిల్టర్ బెడ్స్, శుద్ధి యంత్రాలు, మోటర్లను మరమ్మతులు చేయించి, నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రణాళికల సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇ మోహన్, డిఇఇ ఆనందరాజు, ఎఇ జనార్ధన్, కాంట్రాక్టర్ సుధాకర్, టీడీపీ నాయకులు దుర్గా నవీన్ పాల్గొన్నారు.

ఎస్సీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు మే నెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నరసింహ నాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం కలిగి, బిపిఎల్ కేటగిరి కింద ఉన్న 21 నుంచి 50 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు ఎంపిడిఒ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

గడ్డివామి దగ్ధం..

ప్రజాశక్తి-చిలమత్తూరు

గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డి వామి పూర్తిగా దగ్ధమైన సంఘటన మంగళవారం మండలంలోని మొరంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామంలోని రైతు పులుగూరు రామచంద్రరెడ్డికి చెందిన గడ్డి వామికి గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. దీంతో గడ్డివామి పూర్తిగా కాలి బూడిదవడంతో సుమారు రూ. 70 వేల వరకూ నష్టం జరిగింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

కొండకమర్లలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు మంగళవార మండలంలోని కొండకమర్ల గ్రామంలో సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా పాత ఎక్సైజ్ నేరస్తులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. రౌడీ షీటర్లు, ఆకతాయిలకు కౌన్సెలింగ్ చేశారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. కొండకమర్లలో ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, దుకాణాల ముందు ఎలాంటి వాహనాలు నిలపకూడదన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండకమర్లలో ప్రజలకు సూచనలు చేస్తున్న సిఐ, ఎస్ఐ

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని సహించం : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తే సహించేది లేదని వైసిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపిలోని బిసి, దళిత నాయకులను పోలీసులు అక్రమ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం శాంతియుత ర్యాలీ, వన్ స్టేషన్ ముందు ధర్నా కార్యక్రమానికి వైసిపి పిలుపునిచ్చింది. దీంతో పోలీసులు అంబేద్కర్ సర్కిల్లో బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ సర్కిల్ లో తలపెట్టిన నిరసన కార్యక్రమానికి వైసిపి నాయకులు రాకుండా ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. వైసిపి నేత వేణురెడ్డిని అప్ గ్రేడ్ సిఐ ఆంజినేయులు, రూరల్ సిఐ జనర్దాన్ లు వేణురెడ్డి ఇంటికి వెళ్లి తొలు హౌస్ అరెస్టు చేశారు. శాంతి భద్రతల రీత్య వేణురెడ్డితో పాటు మున్సిపల్ ప్రతి పక్ష నేత ఆసీఫ్ వుల్లా, కురుబ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివలను అరెస్టు చేసిపరగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయినా మరికొందరు వైసిపి నాయకులు కార్యకర్తలు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాన వీధి గుండా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీగా వచ్చి నిరసన వ్యక్తం చేశారు. అంబేద్కర్ సర్కిల్లో వైసిపి నాయకులను పోలీసులు అడ్డగించడానికి ప్రయత్నించారు. అయినా వైసిపి నాయకులు నినాదాలు చేస్తూ రోడ్డు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తప్పు చేస్తే శాఖ పరంగా చర్యలు తీసుకోవాలి కానీ అందుకు భిన్నంగా హిందుపూర్ పోలీసులు వ్యవహరించిన తీరు సర్వసభ్య సమాజం తల దించుకునే విధంగా ఉందని వైసిపి నాయకులు పేర్కొన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ హిందూపురం ప్రశాంతంగా ఉండేదని అలాంటి తరుణంలో హిందూపురంలో కూడా రెడ్ బుక్ రాజ్యాంగం చేయాలని చూస్తున్నారని వీటిని ప్రజలు తిప్పికొడతారని అన్నారు. అనంతరం సాయంత్రం అరెస్టు చేసి పరగి స్టేషన్ లో ఉంచిన నాయకులను పోలీసులు సొంత పూచికత్తుపై విడుదల చేశారు. అక్కడి నుంచి వందలాది మంది నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని వైసిపి కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు